క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మకమలం పుష్పాలు



బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు వై.శేషగిరిరావు ఇంట్లో అరుదైన బ్రహ్మకమలం పుష్పాలు సోమవారం రాత్రి విరబూశాయి. ఏడాదిలో ఒకసారి మాత్రమే పుష్పిస్తాయి. ఒకేమారు రెండు బ్రహ్మకమలం పుష్పాలు వికసించి కనువిందు చేశాయి. కేవలం రాత్రి పూట మాత్రమే వికసించి, తెల్లవారకముందే వాడిపోవడం బ్రహ్మ కమలం పుష్పాల ప్రత్యేకతగా చెప్పవచ్చు. శివుడికి అత్యంత ఇష్టమైన పూలుగా చెబుతుంటారు. ఈ పుష్పాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావించి ఇష్టదైవానికి ప్రత్యేక పూజలు చేశారు. హిమాలయాల్లోని అత్యంత ఎత్తులో మాత్రమే పెరిగే అరుదైన అంతుచిక్కని మొక్క బ్రహ్మకమలం. శేషగిరిరావు ఇంట్లో రెండు పుష్పాలు వికసించడంతో ఆనందం తొణికిసలాడగా పలువురు తరలివచ్చి బ్రహ్మకమలం పుష్పాలను చూసి తన్మయత్వం చెందారు.

సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాండూర్: పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ యూ.ప్రవంతి, పోషక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ జీ.ప్రియసుగంధి సూచించారు. మండలంలోని కొత్తపల్లి తాండూర్ గ్రామాల్లోని రైతులతో 'శాస్త్రవేత్తలు–రైతుల చర్చగోష్టి' మంగళవారం నిర్వహించారు. వర్షాకాలంలో కూరగాయల పంటల పెంపకం వాటి పోషక విలువల గురించి రైతులతో చర్చించారు. అధికారుల సలహాలు సూచనలు పాటించి మంచి లాభాలు అర్జించాలన్నారు. తాండూర్ మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారులు శంకర్, ధనలక్ష్మి, పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



నాటుసారా, పట్టుబడిన నిందితుడితో ఎస్సై

తాండూర్: మండలంలోని మాదారం ఐదు ఇంక్‌లైన్ ప్రాంతంలో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. మాదారం ఎస్సై సౌజన్య కథనం ప్రకారం.. అక్రమంగా కొందరు గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, గుడుంబా తయారీకి వినియోగించే సుమారు 20లీటర్ల బెల్లంపానకంను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా నాటుసారా తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్న బానోతు రమేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'అసత్యపు ప్రచారం మానుకోవాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై బీజేపీ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. చెన్నూర్ మండలంలోని నాగాపూర్ రోడ్డు, కోటపల్లి మండలంలోని నక్కలపల్లి వాగు పై వంతెన కూలిపోయినా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించడంలో నిజం లేదన్నారు. నాగాపూర్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేపై అనవసరపు ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో హిమవంతరెడ్డి, రాజేశ్, శ్రీధర్, నాగరాజు, రాకేశ్, మహేశ్, అన్వర్, కరీం, కమలాకర్, వసీం, సుమంత్ పాల్గొన్నారు.



భీమారంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా హర్‌ఘర్ తిరంగా



చెన్నూర్‌లో...

లక్సెట్టిపేట/చెన్నూర్/జన్నారం/మంచిర్యాలటౌన్/చెన్నూర్‌రూరల్/భీమారం: బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల బైక్ ర్యాలీ తీశారు. భారత్ మాతాకి జై నినాదాలతో హోరెత్తించారు. జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



జన్నారం: బైక్‌ర్యాలీలో బీజేపీ నాయకులు



లక్సెట్టిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలో జాతీయ పతాకం ఆవిష్కరిస్తూ...



కిష్టంపేటలో...

బెల్లంపల్లి బంద్ విజయవంతం

బెల్లంపల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందు దేవాయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం ఇచ్చిన బెల్లంపల్లి పట్టణ బంద్ విజయవంతమైంది. హిందు ఐక్యవేదిక, ప్రజా సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన బంద్ పిలుపునకు వ్యాపార వాణిజ్య వర్గాలు సంపూర్ణ సహకారం అందజేశాయి. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, కిరాణా, ఎలక్ట్రానిక్స్ షాపులు, పాన్‌టేలాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ విజయవంతానికి దోహదపడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా బెల్లంపల్లికి వచ్చిన ఇతర ప్రాంతాల ప్రజలు ప్రత్యేకించి గ్రామీణులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బంద్ విజయవంతం కోసం హిందు ఐక్యవేదిక శ్రేణులు, ప్రజాసంఘాలు పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

తాండూర్‌లో బంద్ సంపూర్ణం

తాండూర్: తాండూర్‌లో మంగళవారం చేపట్టిన బంద్ సంపూర్ణమైంది. హిందూ ఉత్సవ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు వ్యాపార వాణిజ్య సముదాయాల వారు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బంగ్లాదేశ్‌లోని హిందువులకు తమ మద్దతును సంఘీభావాన్ని ప్రకటించారు.

ఆర్కేపీలో...

రామకృష్ణాపూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింస్మాతక దాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన బంద్ పట్టణంలో విజయవంతమైంది. విద్యా, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, ఆరుముళ్ల పోషం, ఈశ్వరాచారీ, ధన్‌సింగ్, బంగారి వేణు, తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: బోసిపోయిన కృష్ణమందిర్ రోడ్

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలోని వ్యాపారస్తులు మంగళవారం బంద్ పాటించి నిరసన వ్యక్తం చేశారు. వ్యాపార కమిటీ ఆధ్వర్యంలో రామన్‌కాలనీ, పాత బస్టాండ్ ఏరియా, మున్సిపల్ ఆఫీస్ గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం మార్కెట్ ఏరియా వ్యాపార కమిటీ ఆధ్వర్యంలో బందు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

నేడు మంచిర్యాల, లక్సెట్టిపేట బంద్

మంచిర్యాలటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను, హత్యలను, దౌర్జన్యాలను ఖండిస్తూ హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. అన్ని వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ చేయాలని కోరారు. ఐబీ చౌరస్తా నుంచి ర్యాలీని నిర్వహించనుండగా, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లక్షెట్టిపేట: మండలంలోని హిందు ఐఖ్యవేధిక ఆధ్వర్యంలో ఈ నెల 14న శాంతియుతంగా నిర్వహించే పట్టణ బంద్‌కు మండలంలోని అన్ని వర్గాల ప్రజలు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, హోటళ్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్సెట్టిపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ పిలుపు మేరకు మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రం ఎంఐఎస్ సంధ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికులు సత్తక్క, మల్లవ్వ, ఎల్లవ్వ, మల్లీశ్వరి, లక్ష్మి, రజిత, పోసవ్వ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరీ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం ఎంఈవో పోచయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రఫియా, కార్మికులు కళావతి, పద్మ, నసీం, పోచక్క, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, మందమర్రి మండలాలకు చెందిన మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేటలో వినతి పత్రం ఇస్తూ...

భీమిని: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కన్నెపల్లి మండల మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్‌శాఖ ఏడీఈ, ఏఈకి సన్మానం

లక్సెట్టిపేట: విద్యుత్ సేవల్లో ఉత్తమ సేవలందిస్తున్నందుకు విద్యుత్‌శాఖ ఏడీఈ, ఏఈలను మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలందిస్తున్నందుకు సీఎండీ కర్నాటి కరుణ్‌రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ కంపెనీ నుంచి ఏడీఈ ప్రభాకర్‌కు ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ఏడీఈగా గుర్తింపు లభించిందని, ఏఈ గణేశ్‌కు మొదటి ర్యాంకు వచ్చిందన్నారు. ఉత్తమ సేవా గుర్తింపు లభించినందుకు సిబ్బంది శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది దివాకర్, గౌస్, నాగన్న, మల్లేష్, చంద్రమౌళి, సత్యం, సతీష్, చందు, సందీప్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

వేమనపల్లి: మండలంలో మంగళవారం నుంచి 2023–24లో జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైనట్లు ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్ తెలిపారు. రూ. 2కోట్ల 57లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు 14గ్రామ పంచాయతీలలో తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. 16వ తేదీన మండలంలోని 14గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి తుది నివేదిక అందజేస్తారని పేర్కొన్నారు.

రాళ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మందమర్రి మండల పరిధిలో రాళ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

జన్నారం: ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ విద్య పర్యవేక్షకులు అంజయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్, అధ్యాపకులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

డీజీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్ డీజీఎంగా పని చేసి అడ్రియాల ప్రాజెక్టు ఇంజనీర్‌గా బదిలీపై వెళ్తున్న యాదయ్యను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో మంగళవారం ఏరియా జీఎం సంజీవరెడ్డి ఆయన్ను శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎఫ్ చెక్కు పంపిణీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిలో గుండెపోటుతో మృతి చెందిన వై చంద్రమౌళి, బాదం రాయమల్లు కుటుంబాలకు కంపెనీ సోషల్ సెక్యూరిటీ ఫండ్(ఎస్ఎస్ఎఫ్)డబ్బులను అందించింది. గనిపై మంగళవారం జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ బ్రహ్మాజీ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.59100 చొప్పున ఎస్ఎస్ఎఫ్ డబ్బులను చెక్కు రూపంలో అందించారు.

జనక్‌ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు



జనక్‌ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ. జనక్‌ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను ఆ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో, మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాలకు జనక్‌ప్రసాద్ దంపతులు హాజరయ్యారు. జనక్‌ప్రసాద్ నేతల, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాల్లో పాల్గొన్నారు. ఐఎన్టీయూసీ నాయకులు గజమాలతో సన్మానించారు.

కొవ్వొత్తుల ర్యాలీ



మంచిర్యాలటౌన్/జన్నారం/భీమారం: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ మంగళవారం మంచిర్యాల పట్టణంలో, జన్నారం, భీమారం మండలాల్లో మంగళవారం బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు, సిబ్బంది

నస్పూర్: నేటి సమాజంలో ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత అని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం సమన్వయ అధికారి సౌజన్య తెలిపారు. 'బేటీ బచావో–బేటీ పడావో' వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని భరోసా కేంద్రం వద్ద ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై హైమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన, సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ శ్రీలత, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై వేధింపులు ఆపాలి

బెల్లంపల్లి: భీమిని మండలంలో పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనులపై అటవీ అధికారుల దాడులను వెంటనే ఆపాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఖర్జీ భీంపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 312లో సాగు చేసుకుంటున్న పోడు భూములకు 1988లో 50మంది గిరిజనులకు ఐటీడీఏ అధికారులు పట్టాలిచ్చారని తెలిపారు. ఆ పట్టాల స్థానంలో 2023 సంవత్సరంలో కొత్తగా 25మందికి పట్టాలు జారీ చేసి, మిగితా 25మంది గిరిజనులను విస్మరించారని తెలిపారు. ప్రస్తుతం ఆ పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను అటవీ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, భూములు సాగు చేయకుండా అడ్డంకులు కల్పిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్, బెల్లంపల్లి డివిజన్ అటవీ శాఖ అధికారులు జోక్యం చేసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని, దాడుల నుంచి రక్షించాలని ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి గిరిజనులకు పట్టాలిప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.రమాదేవి, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతపురి బాపు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవరాజ్

కబ్జా నుంచి కాపాడాలని వినతి

వేమనపల్లి: గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వెనుకాల ఉన్న స్థలం ఆక్రమణకు గురవుతుందని మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన పదిరే పోశం అనే దళితుడి వద్ద నుంచి 8సంవత్సరాల క్రితం ఐదు ఎకరాల భూమి పాఠశాల అవసరం కోసం ప్రభుత్వం తీసుకున్నట్లు తెలిపారు. భూమికి బదులుగా ఆయనకు వేరే చోట ఐదు ఎకరాలు ఇచ్చినట్లు వివరించారు. పాఠశాలకు కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో దస్నాపూర్‌కు చెందిన బడా నాయకుడు కొంత స్థలాన్ని కబ్జా చేసి ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని వివరించారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు సిఫారస్ చేయాలని వేడుకున్నారు.



ఏసీబీ డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న యువకులు

జీజీహెచ్ వైద్యుల నిరసన

మంచిర్యాలటౌన్: ఇటీవల కోల్‌కతాలోని మెడికల్ కాలేజీలో పీజీ వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు మంగళవారం నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా దుండగుడిని కఠినంగా శిక్షించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జీజీహెచ్ ఆసుపత్రి వైద్యులు

క్రైం కార్నర్..

కేసు నమోదు

మందమర్రిరూరల్: పట్టణంలోని కేకే–2 ఓసీ సమీపంలోని జాతీయ రహదారి పక్క న గతంలో ఉన్నటువంటి సమాదులను జే సీబీ, ట్రాక్టర్ సహాయంతో కూలగొట్టారని రామకృష్ణ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవన్‌కుమార్‌తో పాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దుప్పి మాంసం పట్టివేత..?

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలో మంగళవారం దుప్పి మాంసంను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో దుప్పి మాంసం ఉన్నట్లు అటవీశాఖ అధికారులకు అందిన సమాచారంతో తనిఖీ చేయగా మాంసం లభించింది. మరొకరి ఇంట్లో వండిన కూర దొరికినట్లు సమాచారం. ఈ ఘటనలో ఐదుగురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. దుప్పి మాంసాన్ని, కూరను స్వాధీనం చేసుకున్నారు. దుప్పిని ఆ ఐదుగురే వేటాడి హతమార్చారా లేక వేరే వేటగాళ్ల దగ్గర నుంచి మాంసాన్ని కొనుగోలు చేశారా.. అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జైపూర్: మండలంలోని నర్వ బస్టాండ్ సమీపంలో గల పవర్ ప్లాంట్ మూడో గేటు ముందు మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నూర్ పట్టణంలో నివాసం ఉంటున్న పెరుకుల గణేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు కాగా మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించగా, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.

డిపో ఆవరణ పరిశుభ్రం



మంచిర్యాల అర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో ఆవరణలో శుభ్రం చేశారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'డిపో ఆవరణ అపరిశుభ్రం' అనే కథనానికి అధికారులు స్పందించారు. బురదమయంతో కాలుతీసి వేయలేని పరిస్థితి నేపథ్యంలో బురదతో పాటు, మురుగునీటిని శుభ్రం చేయటంతో కార్మికులు 'సాక్షి'కి కతృజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆదివాసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



జనగామలో పాల్గొన్న గ్రామస్తులు

కోటపల్లి: ఆదివాసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం త్వరగా నెరవేర్చాలని తెలంగాణ ఆదివాసీ జిల్లా కార్యదర్శి ఎర్ర పున్నం డిమాండ్ చేశారు. సుపాక గ్రామంలో మంగళవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరుపతి, నాయకులు సమ్మయ్య, సంపత్, పుష్ప, మాయక్క, మల్లక్క, స్వప్న, మల్లేశ్, పున్నం, మల్లయ్య, సడవలి ,మహేశ్ పాల్గొన్నారు.

ఆశవర్కర్ల నిరసన

- సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

దండేపల్లి/తాండూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి: ఆశవర్కర్లను వేధింపులకు గురి చేసిన బెల్లంపల్లి అర్బన్ హెల్త్‌సెంటర్ సూపర్ వైజర్ మధుపై చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్ల సంఘం (సీఐటీయూ)శ్రేణులు మంగళవారం నిరసన తెలిపారు. బెల్లంపల్లి, దండేపల్లి, మందమర్రి, తాండూర్‌లో ఆశ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సూపర్ వైజర్ మధు సమ్మక్క, స్వరూప అనే ఇద్దరు ఆశవర్కర్లను మహిళలని చూడకుండా ఆశ డే రోజున రిజిష్టర్ చూస్తూ దూషించారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. తాండూర్‌లో నాయబ్ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మందమర్రి పాతబస్టాండ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశ వర్కర్లు మంగవారం ధర్నా నిర్వహించారు. ఆశకార్యకర్తలకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు